మక్కువ పంచాయితీ ఇఒకు మెమో

ప్రజాశక్తి -మక్కువ

స్థానిక మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బెహరా శ్రీనివాస్‌కు ఎంపిడిఒ ఎం.అర్జునరావు శుక్రవారం మెమో జారీ చేశారు. మండలంలో అపారిశుధ్యం లేకుండా, ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధించాలని కలెక్టర్ ఇటీవలే ఆదేశించారని, ఈ మేరకు మక్కువలో శుక్రవారం పరిశీలించగా, పారిశుధ్య లోపం, ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్మూలించకపోవడం తమ పరిశీలనలో తేలిందని మెమోలో ఎంపిడిఒ పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యానికి గల కారణాలు రెండు రోజుల్లో తెలపాలని ఎంపిడిఒ ఆదేశించారు. అయితే తాను పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు కార్మికులతో చేపడుతున్నానని, ప్రతిరోజు పరిశీలన చేస్తున్నానని ఇఒ సోషల్ మీడియాలో అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో అన్ని పంచాయతీలు బాగుండి తన పంచాయతీ బాగోలేదా అనిపించేలా ఉందని ఆయన సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తపరిచారు.

“ ఒకప్పుడు పిల్లలు భారం అనుకునేవారు... కానీ ఇప్పుడు పిల్లలే ఆస్తి, పిల్లలే శ్రీరామ రక్ష, పిల్లలే భవిష్యత్. మధ్యాహ్న భోజనం నుంచి స్టూడెంట్ కిట్స్ వరకు నాణ్యత పెంచాం. మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతతో అందిస్తున్నాం. విలువలతో కూడిన సమాజాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో పని చేస్తున్నాం. గతంలో టీచర్లకు చాలా యాప్‌లు ఉండేవి. ఇప్పుడు అలాంటి ఇబ్బందులను తొలగించాం. శనివారం నో బ్యాగ్ డే... ఆడుతూ పాడుతూ విద్యార్థులకు నచ్చిన పని చేస్తున్నారు. ఇష్టంతో తక్కువ సమయం చదివినా రాణిస్తారు. చదువులో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా అవార్డులు ఇస్తున్నాం. విద్యలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించేందుకు క్లస్టర్ అప్రోచ్ ద్వారా ప్రయత్నిస్తున్నాం. సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టే బాధ్యత విద్యార్థులకు ఉంది. ”

- మెగా పిటిఎంలో సిఎం చంద్రబాబు

మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి

- ప్రయివేట్ కంటే ప్రభుత్వ స్కూళ్లలోని టీచర్లే బెస్ట్
- మెగా పిటిఎంలో సిఎం చంద్రబాబు
- భామిని ఎపి మోడల్ స్కూల్‌ను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించిన సిఎం

మెగా పిటిఎంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం/భామిని

ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వారిని మట్టిలో మాణిక్యాలుగా తీర్చిద్దిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులే మంచి నైపుణ్యం కలిగి ఉన్నారని, కావున విద్యార్థులు బాగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. భామిని మండలంలోని ఎపి మోడల్ హైస్కూల్లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. భామిని చేరుకున్న సిఎంకు అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. తొలుత పాఠశాలలో స్పోర్ట్స్ రూమ్, స్కిల్ ల్యాబ్‌లను పరిశీలించారు. క్లాస్ రూమ్ టీచింగ్‌ను విద్యార్థులతో కలిసి కూర్చొని విన్నారు. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కూర్చొని విద్యార్థుల ప్రొగ్రెస్ రిపోర్టులను చంద్రబాబు, లోకేష్ అడిగి తెలుసుకున్నారు. విద్యలో పిల్లల బలాబలాలు తెలుసుకునేందుకు అందుకు అనుగుణంగా విశ్లేషించుకుని స్కై, మౌంటెన్, స్ట్రీమ్ అనే మూడు రకాలుగా వర్గీకరించామని, క్లిక్కర్ అనే విధానం పిల్లలను మరింత ఆసక్తిగా చదువుకునేలా చేస్తోందని చంద్రబాబుకు లోకేష్ వివరించారు. ఎప్పటికప్పుడు పిల్లల చదువును విశ్లేషించేలా క్లిక్కర్ బాగా పని చేస్తోందన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. రాబోయే కాలంలో విద్యా వ్యవస్థలో ఎవరూ ఊహించని ఫలితాలు వస్తాయని, దీనికి అంతా సహకరించాలని కోరారు. పిల్లలను సానబెడితే అద్భుతాలు సాధిస్తారన్నారు. ఎఎస్ఆర్ జిల్లాకు చెందిన అంధ క్రీడాకారిణి కరుణ కుమారి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని అంధ మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌ను సాధించిందన్నారు.

ప్రదర్శనను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

విద్యాశాఖా మంత్రి లోకేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను గౌరవించే విద్యావిధానం అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. స్త్రీ,పురుష సమానత్వం రావాలని కోరారు. ఇంటి పనుల్లో మహిళలకు పురుషులు సహకరించాలని సూచించారు. విద్యారంగంలో సమూలంగా మార్పులు తీసుకురావడానికి ఉపాధ్యాయులను ఫిన్‌లాండ్ లాంటి దేశాలకు అధ్యయనం కోసం పంపుతామన్నారు. ఇటీవల విద్యార్థులతో మాక్ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి వారిలోని సృజనాత్మకతను వెలికి తీసినట్టు చెప్పారు.

పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో తోటపల్లి ఎడమ కాలువ నిర్మాణం, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే చెప్పిన తోటపల్లి ఎడమ కాలువ నిర్మాణం, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వంశధార, పోలవరం అనుసంధానం చేస్తామని చెప్పారు. సభ అనంతరం విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ మధ్యాహ్న భోజనం చేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ స్వప్నల్ పవర్ జగన్నాథ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రదర్శించిన ఐటి సెల్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు

సిఎం చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, ఎస్‌పి మాధవరెడ్డి

మన్యం జిల్లాకు పరిశ్రమలు కేటాయించండి

పార్వతీపురం టౌన్ : ఆర్థికంగా వెనుకబడి ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాకు పరిశ్రమలు కేటాయించి యువతకు ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర విజ్ఞప్తి చేశారు. శుక్రవారం భామినిలో జరిగిన తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న చంద్రబాబుకు ఈ మేరకు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి పరిశ్రమల ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయింపునకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

భామిని : జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రభుత్వ మోడల్ జూనియర్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, పాలకొండ సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఇతర అధికారులు, పలువురు నాయకులు స్వాగతం పలికి పుష్ప గుచ్చాలను అందించారు.

సభలో మాట్లాడుతున్న విద్యార్థి;

విద్యార్థులతో కలిసి టీచింగ్‌ను వింటున్న సిఎం చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేష్

పుస్తక పఠనం మనోవికాసానికి దోహదం

పుస్తక మహోత్సవం ముగింపు సభలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి-పార్వతీపురం

పుస్తక పఠనం మనోవికాసానికి దోహదం చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పదిరోజులుగా నిర్వహించిన మన్యం పుస్తక మహోత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలు గా గ్రంథాలయాలు ఆదరణ కోల్పోయిన పరిస్థితి నెలకొందన్నారు.దీనికి కారణం కార్పొరేటీకరణ, మత విద్వేషాలేనని చెప్పారు. వీటి ప్రభావం తెలియకుండా గ్రంథాలయ వ్యవస్థ పై పడిందన్నారు. ఒకప్పుడు గ్రంథాలయాల్లో కవులు, రచయితలు, యువకులు చదువుకోడానికి వుండేవారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు మాత్రమే వుంటున్నాయని చెప్పారు. విజ్ఞానం వెదజల్లే కేంద్రం గా ఒకప్పుడు గ్రంథాలయాలు వుండేవని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. మనోవికాసానికి ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో వుండడం లేదన్నారు. డిజిటల్ యుగం ప్రారంభమైన తర్వాత కొత్తతరం యువత ఆలోచనా విధానం మారిపోయిందన్నారు. ఏటా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నా తగిన ఆదరణ పెరగడం లేదన్నారు. యువత,పిల్లల్లో ప్రశ్నించే తత్త్వం పెరగాలంటే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ పుస్తక మహోత్సవాలకు ఆదరణ లభిస్తోందన్నారు. జాతీయోద్యమ సమయంలో అన్ని వర్గాల ప్రజలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ఎంతోమంది త్యాగాలతో సాధించిన స్వాతంత్ర్యం నేడు పరాధీనమయ్యే పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. భగత్ సింగ్ 21 ఏళ్ళ వయసు లో స్ఫూర్తిదాయక పోరాటం చేశారని,యువత ఆదిశగా అడుగులు వేయాలని కోరారు. మంతా రఘునాథ శర్మ అధ్యక్షతన జరిగిన సభలో సిరికి స్వామినాయుడు రచించిన రెండు నెలవంకలు పుస్తకాన్ని కెంచు వర్మ పరిచయం చేశారు. కళింగాంధ్ర కథపై దాసరి రామచంద్రరావు ప్రసంగం చేశారు. కవి, రచయిత గంటేడ గౌరినాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో కవి రచయిత పక్కి రవీంద్ర, పుస్తక మహోత్సవం కమిటీ కన్వీనర్ ఎస్.మురళీమోహన్ రావు, పలువురు పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

అలరించిన కోలాటం

పుస్తక మహోత్సవం లో భాగంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ముగింపు సభ అనంతరం శ్రామిక మహిళా సంఘం సభ్యులు కోలాటం పాడారు.

పుస్తకాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్;

కోలాటం ప్రదర్శిస్తున్న శ్రామిక మహిళలు

విద్యార్థుల మరణాలపై ప్రస్తావనేదీ?

రూ.6500 కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల ఎప్పుడు ?
ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అనిల్

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

భామినిలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో విద్యార్థుల మరణాలపై, ఆరోగ్య కార్యకర్తల నియామకం, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వారి ప్రసంగాల్లో ప్రస్తావించకపోవడం బాధాకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అనిల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మన్యం జిల్లాలో ఈ విద్యా సంవత్సరం 12 మంది గిరిజన విద్యార్థులు ఆనారోగ్యంతో మరణించారని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని, మరణించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉండాల్సింది పోయి పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించేందుకు ఎఎన్ఎంలను నియమిస్తామంటూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చేసిన మొదటి సంతకం ఏమైందని ప్రశ్నించారు. జిల్లా పదో తరగతి పరీక్షా ఫలితాలు గత రెండేళ్ళుగామొదటి స్థానంలో ఉందన్నారు. విద్యార్థుకు మెరుగైన చదువుతో పాటు ఆరోగ్యం పరిరక్షించే బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వంపై నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను తల్లిదండ్రులు చేర్పిస్తున్నారని, వీరికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అన్నారు. మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా మరణించిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. తక్షణమే మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గంగారావు, కమిటీ సభ్యులు జగన్ పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అనిల్

7న జాతీయ ఉపకార వేతన పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

2025-26 విద్యా సంవత్సరానికి జరగనున్న జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ ఎం ఎం ఎస్) ఈనెల 7 ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. పరీక్ష కు జిల్లా విద్యా శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టికెట్లను www.bse.ap.gov.in లోను, పాఠశాల లాగిన్ లోనూ, వాట్సాప్ మన మిత్ర యాప్ లోనూ అందుబాటులో ఉంచారు. పరీక్షకు జిల్లాలో మొత్తం 4094 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష నిర్వహణకు బొబ్బిలి, చీపురుపల్లి, విజయనగరంలో మొత్తం 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం 9గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి.

మార్చి 2 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

మార్చి 2న ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు జరగనున్నట్లు డిఇఒ యు.మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ థియరీ పరీక్షలు మార్చి 2 తేదీ నుంచి 13 తేదీ వరకు, పదో తరగతి థియరీ పరీక్షలు మార్చి 16 నుంచి 28 వరకు, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 11 నుంచి 18 తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. థియరీ పరీక్షలు అన్ని ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటలు వరకు,ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

డ్రమ్స్‌ను వాయిస్తున్న శివమణి

శివమణికి పౌర సన్మానం

డ్రమ్స్‌తో యువతను ఉర్రూతలూగించిన శివమణి

ప్రజాశక్తి-విజయనగరంకోట

గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి సందర్భంగా ప్రపంచ ప్రసిద్ధ పర్కషన్ మాస్ట్రో పద్మశ్రీ శివమణికి ఘంటసాల స్మారక కళా పీఠం ఆధ్వర్యాన శుక్రవారం రాత్రి ఆనందగజపతి కళాక్షేత్రంలో పౌర సన్మానం చేశారు. ఆయనకు కంకణం తొడిగి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రపంచంలో నాకు దక్కే ప్రతి గౌరవం తన తల్లికి చెందుతుందని అన్నారు. తనకు మాతా పితాయే గురు దైవమన్నారు. నేటి రోజుల్లో పిల్లలకు సెల్ ఫోన్లు కంటే పుస్తకాలు ఇచ్చి చదివించాలన్నారు. ముఖ్యఅతిథి స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు మాట్లాడుతూ కలలు కానాచిగా పిలవబడుతున్న విజయనగరంలో కలలను కాపాడుకోవాలన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ నేటి తరానికి తన మ్యాజిక్ తో మ్యూజిక్ చేయడం శివమణి గొప్పతనం అన్నారు. దీనికి ముందు మినీ ఘంటసాల కార్యక్రమం చిన్న పిల్లలతో బడిపంతులు సినిమాలోని భారతమాతకు జేజేలు అనే పాటను ఆలపించారు. అనంతరం మ్యూజిక్ మాస్ట్రో శివమణి తన శిష్యుడు పవన్ డ్రమ్స్‌తో లయ విన్యాసం చేసి శ్రోతలను ఉర్రూతలూగించారు. అనంతరం శివవర్మ డ్రమ్స్‌తో యువతకు ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. భీష్మారావు, అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి సర్వేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు గుప్తా, కోశాధికారి అబ్బులు, ఉపాధ్యక్షులు సూర్యలక్ష్మి, డాక్టర్ వెంకటేశ్వరరావు, కాపుగంటి ప్రకాష్, మేక అనంతలక్ష్మి, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

రైతులందరికీ 'సుఖీభవ' వర్తింప జేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి -విజయనగరం కంటోన్మెంట్

పది సెంట్లలోపు భూమి ఉన్న రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథఖాన్ని వర్తింపజేయాలని, చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యధిక రైతులు ఉన్న జిల్లా విజయనగరమేనని, ఇక్కడ భూములు తక్కువగా ఉంటాయని, అందువల్ల అందరికీ అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని అన్నారు. జిల్లాలో 40 వేల మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దూరమయ్యారన్నారు. జిల్లాలో చెరకు పరిశ్రమలైన భీమ సింగి , ఎన్ సి ఎస్ మూసివేసారని, ఉన్న ఒక్కగానొక్క సంకిలి షుగర్ ఫ్యాక్టరీని మూసివేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. సంకిలి యాజమాన్యం మూడు లక్షల టన్నుల చెరుకు లేకపోతే మిల్లు నడపలేమని తెలిపిందని, రైతులతో ఆ దిశగా చెరుకు పంట వేయించడం లేదని, రైతుకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. జిల్లాలో ఉన్న రైతులు సమస్యలపై మంత్రులు ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మిల్లర్లే అధిక కేజీలు ధాన్యం డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదులు ఇన్చార్జి మంత్రికి వచ్చాయని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, పార్లమెంటు పరిశీలకులు కిల్లి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శులు నెక్కలి నాయుడు బాబు, కెవి సూర్యనారాయణ రాజు, భోగాపురం మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో జిసిసి డిఆర్ డిపో

స్టాక్ నిల్వకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి- కురుపాం

మండలంలోని వబ్బంగి పంచాయతీ కాకిలి జిసిసి డీఆర్ డిపో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిపోయింది. దీంతో ప్రజా పంపిణీ సరుకుల నిల్వకు తీవ్ర సమస్యలు నెలకొంది. ఈ మేరకు డిపో డీలర్ ఎం.రవికుమార్ వద్ద "ప్రజాశక్తి' ప్రస్తావించగా, డిపో పరిధిలో 14 గ్రామాలకు 335 రేషన్ కార్డులు, సుమారు 100 క్వింటాళ్ల స్టాక్ వస్తుందని, ఈ స్టాక్ నిల్వ చేయడానికి సరైన భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు సమస్య విన్నవించి పది రోజుల పాటు బియ్యం నిల్వ చేసుకునేందుకు అనుమతి తీసుకుంటున్నామని తెలిపారు. ఇలాంటి ప్రమాదకర భవనంలో ఎలా స్టాక్ ఉంచగలను, ప్రతినెల సరుకు వచ్చిన రోజుల్లో మనశ్శాంతి లేకుండా గడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నిసార్లు అధికారులను ఆశ్రయించగా, నిధుల్లేవన్న కారణంతో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో ఉన్న డిఆర్ డిపో

బంగారు భవిష్యత్తుకు పునాదులు వేద్దాం : మంత్రి

పాఠశాల ఆవరణలో ఫొటో దిగిన మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులన్న నానుడిని నిజం చేయాలని, వారి బంగారు భవిష్యత్తుకు పునాదు వేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశుసంక్షేమశాఖా మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ డే (మెగా పీటీఎం 3.0) కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని తల్లిదండ్రులకు తెలిసేలా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. పిల్లలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. వారి ప్రగతిని తెలుసుకోవడానికి నెలకొకసారి పాఠశాలలకు, కాలేజీకి వచ్చి గమనించాలని ఆమె తల్లిదండ్రులను కోరారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, టెక్స్‌బుక్స్, స్టడీ మెటీరియల్, వొకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ మాన్యువల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (పిటిజి), గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ 3.0 సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ఫేర్ మోడళ్లు, చిత్రాలు, చిత్రలేఖన ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, జియ్యమ్మవలస మండల కన్వీనర్ జోగి భుంజగరావు, తోటపల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరిక జానకి, పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్, నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాలేజీ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని కొత్తవలసలో గల కెపిఎం ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బి.విజయచంద్రపాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ ఘనంగా సత్కరించారు. అనంతరం సారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆన్లైన్లో నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన ముగ్గురు విద్యార్థులకు రూ.5వేలు చొప్పున నగదు బహుమతిని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పలువురి ప్రజాప్రతినిధులు, స్థానిక కౌన్సిల్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు..

కురుపాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు ఆధ్వర్యంలో జరిగిన మెగా పేరెంట్స్ డే వేడుకల్లో రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ పువ్వల లావణ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు లావణ్యను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసి సభ్యులు అంధవరపు కోటేశ్వరరావు, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు రమేష్ చంద్ర పండా, ఎస్ఎంసి చైర్మన్ సుధారాణి, వైస్ చైర్మన్ ముత్తా సూర్యనారాయణ, కురుపాం అభివృద్ధి సంస్థ చైర్మన్ గొటారి వెంకట్రావు, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా జరిగాయి.

వీరఘట్టం : చదువు చెప్పడం తమ వంతని, పిల్లలు ఏ విధంగా చదువుతున్నారో పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ సుధాకర్‌రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, కలిసి భోజనం చేసి సంతోషంగా గడిపారు. అలాగే మండలంలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కెజిబివి, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, మోడల్ ప్రైమరీ పాఠశాలలు, ఫౌండేషన్, బేసిక్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డిజిఎస్‌వి త్రినాధ, ఎంఇఒలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీట్‌ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జడ్పిటిసి సభ్యులు ఎం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎపి మోడల్ హైస్కూల్లో టిడిపి సీనియర్ నాయకులు ఎం ప్రసాదరావు నాయుడు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టిడిపి సీనియర్ నాయకులు ఎం.మల్లేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కస్తూరిబా పాఠశాలలో ఎంపిడిఒ అర్జునరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆటలు, పాటలు, నృత్యాలతో ఆయా పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్లు, సభ్యులు, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ. 10, వేలు వితరణ

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలేనిర్వహించిన మాక్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పాత్ర పోషించి పలు సమస్యలపై అనర్గళంగా మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వంచే ప్రశంస పత్రాన్ని, పతకాన్ని అందుకున్న లెంక సౌమ్య సాయిని అభినందిస్తూ స్థానిక జడ్పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు రూ.10వేలు వితరణ అందజేశారు. ఇటీవల మరణించిన ఆయన తల్లి మావుడి అరుణమ్మ జ్ఞాపకార్థం ఈ నగదను సౌమ్య సాయికి అందించారు. అనంతరం స్థానిక జడ్పీ హైస్కూల్లో మెగా పేరెంట్స్ మీట్ సందర్భంగా సౌమ్య సాయిని పాఠశాల అధ్యాపకులంతా సత్కరించారు.

సీతానగరం : మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ డే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రగతి నివేదికను ప్రిన్సిపల్ ఎల్.దాలినాయుడు నివేదించారు. విద్యార్థుల ప్రోగ్రెస్‌ను వారి తల్లిదండ్రులకు అధ్యాపకులు కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు సాలహరి గోపాల్ రావు, పెదబోగిలి ఉప సర్పంచ్ కె.అరవింద్ కుమార్, మాజీ సర్పంచ్ మూర్తి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ఇ.రాంబాబు, నాయకులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు అలాగే మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ ఆత్మీయక కలయికను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ వెంకటరమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక కెజిబివి పాఠశాల, కళాశాలలో మెగా పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాధవి విద్యార్థులచే నిర్వహించిన డ్రిప్ ఇరిగేషన్ పాల ల్యాబ్ పుస్తక ప్రదర్శన తదితర ప్రాజెక్టుల ద్వారా వివరించారు. తద్వారా లాభాలు గురించి ప్రాజెక్టుల ద్వారా చూపించారు. అదేవిధంగా స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, హెచ్ఎం టి.చంద్రరావు, డిప్యూటీ వార్డెన్ బి.గాసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పాలకొండ : పట్టణంలోని ఎన్‌కె రాజపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం శసపు వాసుదేవరావు ఆధ్వర్యాన మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్ పర్సన్ నీలాపు మణి, నీలాపు సూర్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు పి.నందయ్య, గురువులు, ఉపాధ్యాయులు గాయత్రి జోగి నాయుడు, సుంకరి సూర్యారావు వెంకటరమణ, ఉర్లంక నారాయణరావు, సెనగల్లు లలిత తదితరులు ఉన్నారు

కొమరాడ : మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు ఘనంగా జరిగాయని ఎంఇఒ జె.నారాయణరావు తెలిపారు. కోటిపాం, కొమరాడ జిల్లా పరిషత్ హై స్కూళ్లు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల పాఠశాల, గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన ఆత్మీయ కలయిక సమావేశానికి ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శించారు. ఎపిటిడబ్ల్యు ఆర్ స్కూల్‌లో జరిగిన వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విక్రమంపు జరిగిన కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు దేవకొండ వెంకటనాయుడు, సర్పంచ్ శైలజ, వైసిపి నాయకులు మల్లిబాబు, ఆర్తాం, గంగరేగువలసలో జరిగిన కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గంట వెంకటనాయుడు, అర్తాం ఉపసర్పంచ్ కె.శంకరరావు పాల్గొన్నారు. **బలిజిపేట** : స్థానికప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ టి.మాధవి ఆధ్వర్యాన మెగా పేరెంట్స్‌డే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం హెడ్మాస్టర్ వంగపండు వెంకటనాయుడు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో సత్యసాయి సమితి కన్వీనర్ వెలిది సుబ్బారావు, సర్పంచ్ బండారు రాగలత, ఎంఇఒ ఎస్.సింహాచలం పాల్గొన్నారు.

ట్రైకార్ సభ్యులు లావణ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థినిని అభినందిస్తున్న జెడ్‌పిటిసి శ్రీనివాసరావు



వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు

12న కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి - కొమరాడ

అంగన్వాడీల సమస్యలపై ఈనెల 12న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని సిఐటి నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎస్ ప్రాజెక్టు వద్ద డిఇఒ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సాంబమూర్తి, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి సిరికి అనురాధ మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, మిగిలిన 1810 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరారు. సెంటర్ నిర్వాహనకు ఫోన్లు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాలో అంగన్‌వాడీలంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది విజయలక్ష్మి, గంగమ్మ, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్క ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను కూడా పాటించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీవరం అన్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా మండలంలోని జెకె పాడులో రెండో రోజు ఏర్పాటు చేసిన శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రకృతి మన మనుగడ కోసం ఎంతో సహాయ పడుతుండగా మనం ప్రకృతికి విఘాతం కలిగిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని ఆరాధించాలని మొక్కలు పెంచి చెట్లు చేయాలని, పాలథిన్ వాడకం నిరోధించాలని కోరారు. నీరు, గాలి పరిశుభ్రంగా ఉంచాలని, 20 కిలోమీటర్ల లోపు సైకిల్‌తోనే ప్రయాణించాలని అన్నారు. విద్యార్థి దశ నుంచే శారీరక పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపర్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రామయ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉన్నారు.

సామాన్యులకు అందుబాటులోకి సిఎంఆర్ షాపింగ్ మాల్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వస్త్ర ప్రపంచాన్ని సామాన్య ప్రజలకు సైతం అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం పార్వతీపురం పట్టణంలో సిఎంఆర్ షాపింగ్ మాల్ తీసుకురావడం సంతోషదాయకమని స్థానిక ఎమ్మెల్యే బోనెల.విజయచంద్ర అన్నారు. పట్టణ ప్రధాన రహదారిలో గల ఎస్ఐబి పక్కనే కొత్తగా ఏర్పాటు చేసిన సిఎంఆర్ షాపింగ్ మాల్‌ను శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కథానాయికలు నిధి అగర్వాల్, రితిక నాయక్ వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం సిఎంఆర్ షాపింగ్ మాల్ యజమాని ఎం.వెంకటరమణ మాట్లాడుతూ తెలుగు ప్రజలందరికీ తెలిసిన బ్రాండ్ అంటే ఏదైతే ఉందో అదే సిఎంఆర్ షాపింగ్ మాల్ అని, అటువంటి షాపింగ్ మాల్ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, షాపింగ్ మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యుదయ సైకిల్ యాత్రకు ఘనస్వాగతం

ప్రజాశక్తి - బలిజిపేట

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పిఠాపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన అభ్యుదయ సైకిల్ యాత్ర శుక్రవారం బలిజిపేటకు చేరుకుంది. ఈ యాత్రకు స్థానిక కెజిబివి స్కూలు దగ్గర ఎస్ఐ సింహాచలం ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ఈ సైకిల్ యాత్ర ప్రోగ్రాం ముఖ్యోద్దేశం డ్రగ్ మాదక ద్రవ్యాలు వ్యతిరేకంగా ఈ యాత్ర సాగిస్తున్నట్లు తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎటువంటి మాదకద్రవ్యాలకు బానిస కాకూడదని హెచ్చరించారు. డ్రగ్స్‌కు బానిసలై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై బురాడ రవికుమార్, వెలిది సుబ్బారావు, బండా రాగలత, ఎంఇఒ సింహాచలం, ప్రధానోపాధ్యాయులు వంగపండు వెంకటనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణరావు

నిస్తేజంలో టిడిపి కేడర్

కొలిక్కిరాని పాలకొండ పంచాయతీ

ప్రజాశక్తి - పాలకొండ

నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో గ్రూపులు గోల ఎక్కువగా ఉంది. నేతల మధ్య ఐక్యత లేకపోవడంతో పాటు రెండు గ్రూపులుగా మొదటి నుంచి ఉండడంతో పార్టీ శ్రేణులు గత కొంతకాలంగా ఆందోళన చెందుతున్నారు. పార్టీ పదవులతోపాటు నామినేటెడ్ పదవులు కూడా నియమించే పరిస్థితి లేదు. పార్టీకి ఎన్నికల ముందు కష్టపడి పనిచేసిన నేతలకు విలువ లేదంటూ కొద్దిరోజుల నుంచి ఆ పార్టీలోనే అసంతృప్తి కనిపిస్తుంది. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పడాల భూదేవితో కొంతమంది టిడిపి నాయకులు ఉండగా, జనసేన ఎమ్మెల్యే అయినప్పటికీ ఎన్నికల ముందు వరకు టిడిపి ఇన్‌ఛార్జి అయిన నిమ్మక జయకృష్ణతో కొనసాగడంతో పార్టీలో కొంతమంది ఆయనతోనే ఉన్నారు. అయితే పడాల భూదేవి గ్రూపు ఎన్నికల్లో కూటమి అభ్యర్థి అయిన జయకృష్ణకు పనిచేయలేదని ఎమ్మెల్యేతో ఉన్న టిడిపి వర్గీయులు బహిరంగనే ఆరోపిస్తున్నారు. ఇన్చార్జి కూడా తమకు టిడిపి క్యాడర్ సహకరించడం లేదని పార్టీకి ఫిర్యాదు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయితే భామినిలో గురువారం రాత్రి టిడిపి జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. పాలకొండలోని గ్రూపులను ఒక కొలిక్కి తెస్తారని అందరూ భావించారు. అందుకు భిన్నంగా అక్కడ పరిణామాలు చోటు చేసుకోవడంతో పార్టీ క్యాడర్లో నిరుత్సాహం ఏర్పడినట్లు తెలుస్తుంది. నేతలు తమ మనోగతం చెప్పేందుకు కూడా అవకాశం లేకపోవడంతో పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. పాలకొండ టిడిపి పార్టీలో విభేదాలు ఇప్పట్లో తీరేటెట్లో లేదని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది

డిప్యూటీ ఎంపిడిఒగా శాంతారావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల ప్రజా పరిషత్ డిప్యూటీ ఎంపిడిఒగా శాంతారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట గ్రామీణ నీటి సరఫరా విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతి పొంది బదిలీలపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

సీతానగరం : డిప్యూటీ ఎంపిడిఒగా ఎం.శివప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జామి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాల పాటించాలని, ఎప్పటికప్పుడు సచివాలయం సందర్శిస్తామని ఆయన తెలిపారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త వెంకటరావు

వెంపలగూడలో నేల దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పిపి ఈతమనుగూడ పంచాయతీ పరిధిలో వెంపలగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో నేల దినోత్సవం నిర్వహించారు. ఎఆర్ఎస్ శాస్త్రవేత్త వెంకటరావు మాట్లాడుతూ భూమిని 360 రోజులు పచ్చగా ఉంచాలని, దీనికి రైతులంతా అడవులు పెంచాలని, రసాయనిక, పురుగు మందులు తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. దీని ద్వారా భూమి ఆరోగ్యం బాగుంటుందని, భూ సారం పెరిగి మంచి పంట వచ్చి ఆదాయం పొందవచ్చని, దీని వల్లన వాతావరణం మార్పు జరిగి జీవ వైవిధ్యం బాగుంటుందన్నారు. వీరితో పాటు సైంటిస్టు సౌజన్య, వెలుగు అసోసియేషన్ కార్యకర్తలు పాలక, నాగేశ్వరరావు, కార్తిక్, ఆదిలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ డే విజయవంతం

ప్రజాశక్తి - సీతంపేట

రెండురోజులు జరిగిన టిడిపి సమన్వయ సమావేశం, మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌ను విజయవంతం చేసిన పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ పడాల భూదేవి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం నాయకులకు, వివిధ హోదాల్లో పనిచేస్తున్న నాయకులకు, ప్రజలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, కార్యకర్తలకు, సియుబిలకు, ప్రభుత్వ అధికారులకు, పోలీస్, రెవిన్యూ వివిధ శాఖల అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో గల మహిళా సంఘాలకు కొత్త రుణాలపై అవగాహన కల్పించి పాత రుణాలు రికవరీ వేగవంతం చేయాలని వెలుగు డిపిఎం బంగారమ్మ సీసీలకు, విఒఎలకు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం సతీష్ ఉన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖ నగరంలో జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ డైలీ వేజ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, బిల్డింగ్ సంక్షేమ బోర్డును పునర్దించాలని, హమాలీ, ఆటో ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, కనీస పింఛన్ నెలకు రూ.9వేలు ఇవ్వాలని, ఒపిఎస్‌ను అమలు చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, తదితర అంశాలపై డిమాండ్ చేశారు. కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని 12వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.ప్రసాదరావు, వై.ప్రసాదరావు, చిన్నతల్లి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మండలంలోని వెంకంపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జలుమూరు జనార్ధన్ రావు ఇల్లు అగ్నికి ఆహుతైంది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. బాధితులకు నగదు సాయమందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి తగు సాయం అందించి ఆదుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నుండి అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయమందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

కేన్సర్ ఆస్పత్రిని సందర్శించిన హోం మంత్రి అనిత

ప్రజాశక్తి-కొత్తవలస

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళపాలెంలో గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ - డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ కేన్సర్ ఆస్పత్రిని రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ కేన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేదలకు అందిస్తున్న వైద్యసాయం ఎంతోమందికి స్ఫూర్తినిస్తోందన్నారు. 15 ఏళ్లుగా సుమారు 60 వేల మందికి పైగా వికలాంగులకు కృత్రిమ అవయవాలు ఉచితంగా అందించడం మరెంతో మందికి ప్రేరణగా నిలిచిందన్నారు. పేదలకు అపరిమితమైన సేవలు అందిస్తున్న ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ అనుమతి వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఆర్‌టిసి బస్సు ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన నెలకొన్నది. స్థానిక పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తుండగా గుచ్చిమి సమీపాన సీతానగరం నుంచి పార్వతీపురం వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతుడి వివరాలు తెలియలేదు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే సమాచారాన్ని ఎస్సై ఎం.రాజేష్ 9441518382కి తెలియజేయవలసిందిగా కోరారు.

బస్సు ఢీకొని మృతి చెందిన వ్యక్తి

కంబరలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపించేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శుభారతామని, ఎంఎల్ హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు మాట్లాడుతున్న వీరేష్‌చంద్రదేవ్

సిఎంను కలిసిన వీరేష్ చంద్ర దేవ్

ప్రజాశక్తి - కురుపాం

పాలకొండ నియోజకవర్గం భామిని మండల కేంద్రంలో గల ఎపి మోడల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్ సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేసిన సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ సిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గా సిఎం దృష్టికి కురుపాం నియోజకవర్గంలో రహదారులు, విద్య, ఆరోగ్యం, గిరిజన ప్రాంతాల్లో ఉన్న పలు సమస్యలు తీసుకువెళ్లి అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్‌ను అభినందించిన సిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం పెద్దబుడ్డిడి మండల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వై.శంకరరావు ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ అమలుతీరును వివరించినందుకు గానూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. భామిని మండల కేంద్రంలో గల ఎపి మోడల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన అభ్యసన సామగ్రి ఉపయోగం, ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామం రాష్ట్రంలో అమలవుతున్న తీరును ప్రాజెక్టు ద్వారా సిఎం వివరించారు.

సిఎంకు ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాంను వివరిస్తున్న శంకరరావు